పొలంలో నిప్పు.. భూసారానికి ముప్పు

- పొలాల్లో వరి దుబ్బులు, గడ్డికి నిప్పు
- వద్దని అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోని రైతులు
- పర్యావరణానికి తీరని నష్టం
- దిగుబడులపై తీవ్ర ప్రభావం


కోత కోసిన పొలంలో వరి దుబ్బులకు నిప్పు పెట్టిన దృశ్యం

గణపవరం: అవగాహన లోపంతో రైతులు తమ పొలాల్లోని గడ్డికి, వరి మోడులకు నిప్పు పెడుతున్నారు. వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయిన వరి గడ్డి, వరి దుబ్బులను కాల్చి తొలగించడానికి రైతులు చేస్తున్న ప్రయత్నాలు భూసారంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయని వ్యవసాయ నిపుణులు మొత్తుకుంటున్నా రైతులకు పట్టడంలేదు. ఏటా పొలాలలో నిప్పు పెడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. వేసవిలో ప్రతి గ్రామంలో ఏ ఆయకట్టు చూసినా పొలాల్లో గడ్డి తగలబడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రైతులు వరిని యంత్రాలతో కోయడం వల్ల వరి దుబ్బులు పెద్దవిగా ఉంటున్నాయి. దీనితో పాటు యంత్రంతో కోసిన గడ్డి ముక్కలుగా పొలాల్లోనే పోగులు పడి ఉంటుంది. ఈ వరి దుబ్బులు గడ్డి తొలగించడం రైతులకు వ్యయంతో కూడిన పని కావడంతో రైతులు గడ్డి, వరి దుబ్బులను ఒక్క అగ్గిపుల్లతో కాల్చి బూడిద చేస్తున్నారు. వరి కోతల తర్వాత ఖాళీగా ఉన్న సమయంలో పొలంలో మిగిలిపోయిన గడ్డిని కాల్చివేయడం వల్ల నేలలోని క్రిమి, కీటకాలు చనిపోతాయని దీనివల్ల రాబోయే పంటకు మేలు కలుగుతుందని రైతులు భావిస్తుంటారు. దీనివల్ల మేలుకన్నా కీడే ఎక్కువ జరుగుతుందని, రైతులు కేవలం అవగాహన లోపంతోనే ఇలా చేస్తున్నారని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. గత నెలలో ఎండలు విపరీతంగా కాయడంతో చాలా మంది రైతులు ఎండుగడ్డికి పొలాల్లోనే నిప్పుపెట్టారు. ఇలా చేయడం ప్రమాదకరమని, మనుషులతో పాటు పొలానికి ప్రమాదం పొంచి ఉంటుందని చెబుతున్నారు.

గడ్డికాల్చడం వల్ల నష్టాలు

- పొలాల్లో మిగిలిపోయిన గడ్డి, వరి దుబ్బులను తగలబెట్టడం వల్ల భూమిలో ఉండే గాలి, నీరు కోతకు గురై భూసారం తగ్గింది.
- భూమిలో భూసారం పెంచే బ్యాక్టీరియా, ఫంగస్, సూక్ష్మజీవులు నశించి భూసారం కోల్పోయి, భూమి నిస్సారంగా తయారవుతుంది. దీనివల్ల దిగుబడులు తగ్గి రైతులకు నష్టం కలుగుతుంది.
- గడ్డికి నిప్పుపెట్టడం వల్ల గ్రీన్‌హౌస్ గ్యాస్ విడుదలై భూ ఉష్ణోగ్రత పెరిగి రానున్న పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- వాతావరణ కాలుష్యం పెరిగి పొగమంచు ఏర్పడటం వల్ల పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది.
- గడ్డికి మంటపెట్టడం వల్ల మనుష్యులకు ప్రమాదకర వ్యాధులు సోకే అవకాశం ఉంది.
- గడ్డిని తగులబెట్టడంవల్ల కాలుష్యకారకాలు వాతావరణంలో చేరి గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి.

భూసారం కాపాడుకోవాలి



రైతులు గడ్డి, వరి మోడులను కాల్చకుండా రొటోవేటర్, బేలర్ వంటి పరికరాల సహాయంతో భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. దీనివల్ల దిగుబడులు పెరుగుతాయి. పంట వ్యర్థాలు త్వరగా కుళ్లిపోయేలా చేయడానికి బయో డీకంపోజర్స్ ఉపయోగించాలి. వ్యవసాయ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేస్తే భూసారం పెరిగి ఎరువులు, రసాయనాల వినియోగం తగ్గడమేకాక, ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. భూసారానికి, దిగుబడులకు, పర్యావరణానికి నష్టం కలిగించే నిప్పు పెట్టే పద్ధతిని రైతులు విడనాడి, వ్యవసాయ నిపుణులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలి.

– యర్రంశెట్టి ప్రసాద్, ఏవో

పాఠ్యపుస్తకాల పంపిణీ

దెందులూరు: ప్రభుత్వం అందిస్తున్న, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సొంతంగా ఇస్తున్న పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మరీదు మనోహర్ అధ్యక్షుడు పాఠ్య, రాత పుస్తకాల పంపిణీ చేశారు. విద్యార్థులకు రాత పుస్తకాలను టీడీపీ నాయకులు చింతా సుబ్బారావు, మాగాని సత్యనారాయణ, భవాని ప్రసాద్, అచ్చారావు, చందు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ అందజేశారు.

నేడు దెందులూరులో మెగా వైద్యశిబిరం

దెందులూరు: దెందులూరు వీరమాచినేని పుష్ప కల్యాణ మండపం వద్ద బుధవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, వైద్యులతో దెందులూరు మండల రామదండు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులు పంపిణీ చేస్తారని రామదండు దెందులూరు మండల నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. కీళ్లు, కాళ్ల నొప్పులు, గుండె, స్త్రీల వ్యాధులు, వెన్నునొప్పి, ఇతర అన్ని పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని ఈ అవకాశాన్ని దెందులూరు ప్రజలతో పాటు సమీప గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నూకరాజు కోరారు.

క్లుప్తంగా

వ్యాయామ కళాశాలలో సంబరాలు

- భారత క్రికెట్ జట్టుకు నితీష్‌కుమార్ రెడ్డి ఎంపికపై హర్షం

దెందులూరు: విశాఖపట్టణానికి చెందిన ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్‌రెడ్డి జింబాబ్వే పర్యటనకు వెళ్తున్న భారత క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్తానియేలు అన్నారు. మంగళవారం వ్యాయామ కళాశాలలో భారత్ జట్టులో ఆంధ్రుడు, తెలుగు వ్యక్తి చోటు సంపాదించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతిభ చూపి భారత జట్టుకు, విశాఖపట్టణానికి, తెలుగువారందరికీ నితీష్‌కుమార్ రెడ్డి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యూపీఈడీ, యూజీఈడీ విద్యార్థులు జయహో నితీష్ కుమార్ విజయం సాధించాలంటూ నినాదాలు చేశారు.అనంతరం స్వీట్లు పంచుకున్నారు.

రామాలయంలో కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు కమ్మ రామాలయంలో కల్యాణోత్సవం మంగళవారం నిర్వహించారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రామాలయం కల్యాణోత్సవంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. మారిన రామకృష్ణ, రత్నకుమారి, చోడే అమృత సాయి వినోద్ దంపతులు పీటపై కూర్చుని కల్యాణోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ అన్నసమారాధనలో గ్రామంలో ప్రజలు, పత్సమట్ల భీమరాజు పాల్గొన్నారు. ఉపసర్పంచి పాతూరి జగదీష్ పర్యవేక్షించారు.

27న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దారు శివయ్య, విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

ఉంగుటూరు: ఈనెల 27న దివ్యాంగుల నిర్ధారణ వైద్యశిబిరం ఉంగుటూరులో నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయుడు రాజు తెలిపారు. నారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రత్యేక అవసరాల గల బాల బాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 6 నుంచి 18 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు ఈ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను తహసీల్దారు శివయ్య, ఎంఈవో కె. శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారం చేశారు.

యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు ప్రారంభం


కైకరం హైస్కూల్లో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు

ఉంగుటూరు: యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు ప్రక్రియ మంగళవారం కైకరంలో ప్రారంభించారు. కైకరం పాఠశాల హెచ్‌ఎం జి.ప్రసాదరావు ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజలో ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ గౌరవ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లు శ్రీను, కోశాధికారి ఆనందకుమార్, పుప్పాల నర్సింహారావు, బొమ్మిడి ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

చిన్నారులంతా ఉన్నత విద్యావంతులు కావాలి

ఏలూరు రూరల్ : పేద, అనాథ పిల్లలను ఉన్నత విద్యావంతులు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ విజయరాజు అన్నారు. మంగళవారం స్థానిక 18వ డివిజన్‌లోని రివర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద, అనాథ పిల్లలకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్రియ రేఖ దిగువన నివసిస్తున్న కుటుంబాల పిల్లలు సైతం ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొందాలన్నారు. దీనివల్ల సమాజంలో హెచ్చుతగ్గులు తగ్గుతాయని వివరించారు. పేద విద్యార్థుల్లో ధైర్యం నింపి వారిలో ఆత్మ విశ్వాసం పెంచాలన్నారు. ట్రస్ట్ సేవలను కొనియాడారు. అనంతరం పిల్లలకు నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లు, వాటర్‌బాటిల్ తదితర వస్తువులు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ కాటూరి సుధాకర్, ఉపాధ్యాయుడు జీజే స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ ప్రారంభం


మట్టి నమూనాలు సేకరిస్తున్న కాగుపాడు గ్రామ సహాయ వ్యవసాయ అధికారిణి అనూష

ఉంగుటూరు: మట్టి నమూనాలు సేకరణ ఉంగుటూరు మండలంలో మొదలు పెట్టారు. మండలానికి 1,710 నమూనాలు సేకరించాలని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ఈనెల 10న ప్రారంభించి ఇప్పటి వరకు 625 నమూనాలు సేకరించారు. ఖరీఫ్ పనులు ముంచుకొచ్చేయడంతో నమూనాలు తీయడం కష్టంగా మారింది. ఖరీఫ్ పనులు మొదలవుతున్న తరుణంలో వ్యవసాయశాఖ సిబ్బంది మట్టి నమూనాల సేకరణ ప్రారంభించారు. దీంతో భూసార పరీక్ష ఫలితాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మూడేళ్లలో ఆరు పంటల వరకు ఈ ఫలితాలు ఉపయోగపడతాయనేది ప్రభుత్వం ఉద్దేశ్యం. భూమి సారాన్ని ఈ పరీక్షల ద్వారా వెల్లడవుతాయి. దీనిని అనుసరించి వ్యవసాయశాఖ అధికార్లు లోపాలను సరిదిద్దేందుకు నేల సారం పెంచేందుకు అవసరమైన సూచనలిస్తారు. భూసారాన్ని అనుసరించే పంట దిగుబడులు ఆధారపడి ఉంటాయి. నత్రజని, భాస్వరం, పొటాష్, ఖనిజ లవణాలు ఇతర పోషక విలువలు నేలలో ఎంత మేరకు ఉన్నాయో పరీక్షల ద్వారా తెలుస్తుంది. ప్రస్తుతం ఉంగుటూరు మండలం పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ శాఖ సహాయకులు ముమ్మరంగా మట్టి నమూనాల సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ఏడీఏ ఉషా రాజకుమారి, ఏవో బాలిన వెంకటేష్ పర్యవేక్షణంలో మట్టి నమూనాల సేకరణ నిర్వహిస్తున్నారు.

సీతంపేట కాలువలో పూడికతీత


దెందులూరు రైల్వేగేటు వద్ద సీతంపేట కాలువలో పూడికతీసి గట్లను పటిష్టపరిచిన దృశ్యం

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే అండర్‌పాస్ పక్కన ఉన్న సీతంపేట కాలువలో అండర్‌పాస్ నిర్మాణం వల్ల పూడుకుపోయిన మట్టిని తొలగించారు. ఐదు రోజులుగా శ్రమించి జేసీబీలు, ట్రాక్టర్లల్లో కాలువల్లో పూడికపోయిన మట్టిని తొలగించి కాలువకు రెండువైపులా ఉన్న గట్లను పటిష్టం చేశారు. ఆదర్శ రైతు వీరమాచినేని శివాజీ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, సూచన మేరకు ఇరిగేషన్, రైల్వే అధికారులు స్పందించి పూడికపోయిన మట్టిని తొలగించేందుకు అంగీకరించారు. ఈ మట్టి తొలగించడం వల్ల సీతంపేట ఆయకట్టుకు వెళ్లే 5 వేల ఎకరాల సాగుకు ఇకపై ఎటువంటి అవాంతరాలు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇరిగేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు


ఆర్జావారిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సూచనలందిస్తున్న ఈవోఆర్డీ సుందరి

భీమడోలు: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు భీమడోలులో మంగళవారం పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేశారు. క్లోరినేషన్ చేయించారు. భీమడోలు ఈవోఆర్డీ సుందరి ఆధ్వర్యంలో వివిధ గ్రామ పంచాయతీల సిబ్బంది పలు ప్రాంతాల్లో మురుగునీరు కిందకు పారేలా డ్రెయినేజీల్లో పూడిక తీయించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ పరిసరాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగు సూచనలందించి అనంతరం రికార్డులను పరిశీలించారు. చిన్నారులంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా వారికి తగిన తర్ఫీదును అందించాలని కోరారు. వారికి అందించే ఆహారం తాజాగా రుచికరంగా ఉండాలని సూచించారు. భోజనానికి ముందు అనంతరం చిన్నారులు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కేంద్రాల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రులకు వ్యాధుల వ్యాప్తి– నివారణపై అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని, విద్యార్థి దశ నుంచే వ్యాధులు వ్యాప్తి– నివారణపై అవగాహన కలిగి ఉండాలని వైద్య సిబ్బంది అన్నారు. మంగళవారం జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాశిపాడులోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మలేరియా, ఇతర అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ ఇల్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటి ఆవరణలో, అనవసర వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని విద్యార్థులకు వివరించారు. దోమల ద్వారానే మలేరియా, డెంగీ వ్యాధులు వస్తాయని అందువల్ల దోమల నిర్మూలనకు కృషి చేయాలని, దోమల బారి నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎం.వెంకటేశ్వర్లు, టీఎస్‌వీ రంగ నాయకులు, ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఉపకరణాల అందజేత

ఏలూరు (టూటౌన్): దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడ మణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని విభిన్న ప్రతిభావంతుల జిల్లా కార్యాలయంలో మంగళవారం భీమవరానికి చెందిన దివ్యాంగుడు కొరడా శ్రీనివాస్‌కు చేతి కర్రలు (క్రచ్చస్)ను ఆమె అందజేశారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందించనున్నట్టు చెప్పారు. అవసరమైన వారు ముందుగా జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు కొరడా శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.

ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అమలు చేసిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య చరిత్రలో ఓ చీకటి అధ్యాయం అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. స్థానిక సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కాలేజీలో మంగళవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమర్జెన్సీ కాలంలో దేశంలో ఎదురైన ఇబ్బందులను అర్జుల మురళి వివరించారు. ఈ సందర్భంగా నాడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ఏలూరుకు చెందిన ముద్దాని దుర్గారావును ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కట్నేని కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

దెందులూరు రైల్వేగేటు వద్ద పైవంతెన నిర్మించాలి



దెందులూరు- శ్రీరామవరం వెళ్లే రోడ్డులో రైల్వేగేటు

దెందులూరు: దెందులూరు– శ్రీరామవరం వెళ్లే ద్వారకాతిరుమల రోడ్డులో రైల్వేగేటు వద్ద పైవంతెన నిర్మాణం చేపట్టాలని వంతెన సాధన సమితి చైర్మన్ కాలి భూషణం, కన్వీనర్ పేరం ప్రసాద్ డిమాండ్ చేశారు. ఏలూరు, విజయవాడ, గుంటూరు, తెలంగాణ నుంచి ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి) వేంకటేశ్వరస్వామి సన్నిధికి వచ్చే భక్తులకు దెందులూరు మీదుగా వెళితే దూరం, ప్రయాణఖర్చు తగ్గుతుంది. అలా కాకుండా భీమడోలు మీదుగా వెళితే సమయం ఎక్కువ కావడంతో పాటు ఖర్చు కూడా అధికమవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఏలూరు నుంచి ద్వారకాతిరుమల మధ్యలో దాదాపు 22 గ్రామాలున్నాయి. మూడు మండలాల ప్రజలతో పాటు వేలాది మంది భక్తులు వెళ్లే ఈ దారిలో తరచూ అరగంట కొకసారి గేటు పడటం వల్ల ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతమన్నారు. కేంద్ర రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ప్రజలు, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పుణ్యక్షేత్రానికి భక్తులందరూ త్వరితగతిన వెళ్లేందుకు దెందులూరు రైల్వేగేటు వద్ద పైవంతెన నిర్మించాలని భూషణం, ప్రసాద్ కోరారు.

వర్షాకాలం.. పొంచి ఉన్న ప్రమాదం

- కలుషిత నీరు, ఆహారంపై జాగ్రత్త అవసరం
- దోమల కాటుతో ప్రాణాంతక వ్యాధులు
- సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది


భీమడోలులో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేస్తున్న సిబ్బంది


గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

భీమడోలు: వర్షాలు కురవడంతో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. దీనితో వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారంపై జాగ్రత్తగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలంటూ వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధుల బారిన పడిన వారి వివరాలను గడపగడపకూ వెళ్లి సర్వే ద్వారా తెలుసుకుంటున్నారు. దోమ కాటు కలుషిత ఆహారం, నీరు విషయంలో విస్తృత ప్రచారం చేస్తుండడంతో పాటు సర్వే నిర్వహించి దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపడుతున్నారు. అందుకు సంబంధిత ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందికి ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చే కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నదీ లేనిదీ వాటిలో క్లోరినేషన్ శాతం వంటి వాటిని వైద్య సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. ఆసుపత్రుల్లో చేరి వారి వివరాలు సేకరించి, జ్వర కేసులపై నిఘా ఉంచి ఏ ప్రాంతంలో అవి నమోదయ్యాయనే అంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌లు అందుబాటులో ఉండడంతో వైద్యం ప్రజలకు చేరువైంది. దీనితో వ్యాధి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆసుపత్రికి వచ్చే అవకాశం ఉందని వైద్య సిబ్బంది అంటున్నారు.

దోమకాటు వ్యాధులు సోకే అవకాశం

వర్షాకాలంలో విపరీతంగా దోమలు వృద్ధి చెందిన వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి. ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిలో పెరిగే దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకే అవకాశాలున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని వైద్య శాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, పూల కుండీలు, ఇంటి బయట ఉండే కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో వర్షపు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయని చెబుతున్నారు. ప్రజలు తీసుకునే జాగ్రత్తలతోనే వ్యాధులను అరికట్టవచ్చునని వైద్యులు చెబుతున్నారు.


మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసేందుకు మందును సిద్ధం చేస్తున్న పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది


కలుషిత నీరు, ఆహారంతో

వర్షాకాలంలో కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా సోకే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలు గ్రామాల్లో వ్యాధులు నమోదవుతున్నాయి. బయట కలుషిత ఆహార పదార్థాలు తీసుకున్నా డయేరియా సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక వేళ వాంతులు, విరోచనాలు అవుతున్నట్లయితే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని, 2, 3 సార్లు విరోచనాలు, వాంతులు అయితే సమీపంలోని ఆసుపత్రుల్లో చేరి వైద్య సహాయం పొందాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమ కాటు ఆరోగ్యానికి చేటు

జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వైద్య ఆరోగ్య శాఖ చేపడుతుంది. ఈ క్రమంలో ఈనెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మాసోత్సవాలను నిర్వహిస్తుంది. మలేరియా, డెంగీ వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరిస్తున్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో ఈ వ్యాధి లక్షణాలు బయట పడతాయని, చిన్నపిల్లలు, గర్భిణులు, మరింత అప్రమత్తంగా ఉండాలని ఎబుతున్నారు. బీఎస్ఆర్డీ టెస్ట్ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చునని చెబుతున్నారు. వైద్య కుటుంబ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నీటిలో దోమల వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేస్తున్నారు. గంబూసియా చేపలను వదలడం ద్వారా నీటిలోని దోమల లార్వాలను అరికట్టవచ్చునని చెబుతున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా రక్షణ పొందవచ్చునని చెబుతున్నారు. భీమడోలు మండలంలోని గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీలుండగా, భీమడోలులో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. దీనితో పాటు పలు గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను గత ప్రభుత్వం నిర్మించడంతో సేవలు విస్తృతంగా ప్రజలకు అందుతున్నాయి.

వ్యాధులపై విస్తృత ప్రచారం



మలేరియా, డెంగీ వ్యాధులు సోకకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాం. గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్ వంటి కార్యక్రమాలను విస్తృతం చేశాం. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని చేపడుతున్నాం. సీజన్ మారినప్పుడలా వచ్చే వ్యాధులపై ప్రజలకు తమ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు తెలియజేయడంతో పాటు అవసరమైన మందులను అందిస్తాం. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఆసుపత్రి వచ్చి వైద్య సాయాన్ని పొందాలి. దోమల నిర్మూలనకు పిచికారీ చేయిస్తున్నాం.

– కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, గుండుగొలను

గ్రంథాలయానికి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల అందజేత


అధికారులకు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందిస్తున్న దాతలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి దాతలు ఎం సాంబశివరావు, ఎం చిట్టిబాబు, 5 ఫ్యాన్లు, 5 ట్యూబ్ లైట్లు అందజేశారు. మంగళవారం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు గ్రంథాలయ అధికారులకు ఆయా వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి, ఉద్యోగార్జనే లక్ష్యంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని రిఫరెన్స్ విభాగంలో అనేక మంది జిల్లాలోని వివిధ ప్రాతాల నుంచి వచ్చి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను చదువుతున్నారని, అటువంటి వారికి సౌకర్యార్థం ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకుడు నారాయణరావు, సహాయ గ్రంథపాలకులు వీటి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ


పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం విద్యావంతులు కావాలని సౌభాగ్యలక్ష్మి జ్యూలరీస్ అధినేత వంగలపూడి ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన వైఎస్సార్ కాలనీ మండల పరిషత్ పాఠశాలకు సుమారు రూ.20 వేలు విలువ చేసే 15 కుర్చీలను అందజేశారు. హెచ్‌ఎం పి.జయలక్ష్మి, ఉపాధ్యాయులు జీజేఏ స్టీవెన్, పి.లక్ష్మి, సూర్యకుమారి, టీడీపీ నేత మెరుగుమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.